క్లుప్తంగా

అంకాలమ్మకు విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో రౌద్రాల అంకాలమ్మ

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో గంగజాతరలో భాగంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి అభిషేకము, ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు నిర్వహించి నైవేద్యం, హారతి, తీర్థ ప్రసాదాల వినియోగం చేపట్టారు. పలువురు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాధవరం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



బాలమురగన్

కురబలకోట : అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. బాలమురగన్‌కు తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ బుధవారం తెలిపారు. ఫుడ్ క్వాలిటీ, సేఫ్టీ ఇన్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌పై పరిశోధనలకు గాను ఈ డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

లోకాయుక్తను కలసిన తహసీల్దార్



లోకాయుక్తకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్

పెద్దతిప్పసముద్రం : రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి మంగళవారం మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లిలోని స్వగృహానికి విచ్చేశారు. మూడు రోజుల విడిది కోసం వచ్చిన లోకాయుక్తను తహసీల్దార్ విద్యాసాగర్, ఎస్‌ఐ రవీంద్రబాబుతో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ పి.శ్రీనాథ్‌రెడ్డి, వీఆర్వోలు వరదరాజులు, చినపరెడ్డి, కార్యదర్శి సురేంద్రబాబు తదితరులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అదుపుతప్పి లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

ములకలచెరువు : మండలంలోని బురకాయల కోట సమీపంలోని గురుకుల పాఠశాల వద్ద మంగళవారం వేకువ జామున ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. సత్యసాయి జిల్లా తనకల్లు మండలం చీకటిమానిపల్లి నుంచి నర్సరీ ఖాళీ క్రేట్లతో చెన్నైకి వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా పడిన్నట్లు బాధితులు తెలిపారు.

ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ఆదాయం పెంచేందుకు అందరూ కలిసి కృషి చేయాలని ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక డిపో కార్యాలయంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ స్పెషల్ సర్వీసులు బుక్ చేసి డిపోకు ఎక్కువ ఆదాయం పెంచాలన్నారు. ఈనెలలో షార్, పౌర్ణమికి అరుణాచలంకు ఆరు బస్సులు బుక్ చేయాలన్నారు. డ్రైవర్లు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ గంగంపల్లి క్రాస్ వద్ద మంగళవారం ఎస్‌ఐ రవీంద్ర బాబు సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఇదే పంచాయతికి చెందిన బాణాల ఎర్రప్ప (41) కర్ణాటక రాష్ట్రం ఏనుగుదల వైపు నుంచి అడ్డదారిలో నల్లటి కవర్‌తో వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. అందులో 90 మిల్లీల 45 మద్యం ప్యాకెట్లతో నిందితుడు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ఆశయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : పేద ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే గూడరేవుపల్లె పంచాయతీ గూడరేవుపల్లె కస్బా, పెద్దపల్లె, బెస్తపల్లె తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి నాలుగేళ్లలో లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం రూ. లక్ష నుంచి రూ. పది లక్షల వరకు ప్రభుత్వం ఆర్థికంగా లబ్ధి పొందినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఆలోచనలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దూసుకుపోతోందని చెప్పారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ఒక వర్గానికి మాత్రమే పథకాలు అందించేదని తెలిపారు. అదే ప్రస్తుతం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కుల మత వర్గాలకు అతీతంగా అన్ని వర్గాలకు పథకాలు అందిస్తున్నారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏదో విధంగా సంక్షేమ పథకాలు అంది ఆర్థిక లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు అప్పటికప్పుడే సంబంధిత కారులకు తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. అర్హత ఉండి చిన్నచిన్న కారణాలతో ఇంకా ప్రభుత్వ పథకాలు ఎవరికైనా అందకుండా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటివి సరిచేసి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణమ్మ, సర్పంచ్ హబీబ్‌బాషా, నాయకులు బద్రీనాయక్, వినాయక, సీకే, శ్రీహరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 19న బహుజన రాజ్యాధికార సభ



బహుజన రాజ్యాధికారసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

మదనపల్లె : రాజ్యాంగ పరిరక్షణ కోసం, రాజ్యాధికారాన్ని సాధించేందుకు జూన్ 19న మదనపల్లెలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహుజన రాజ్యాధికార సభను జయప్రదం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో బహుజన రాజ్యాధికార సభ కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బందెల గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ... రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఎన్నికలు అగ్రకుల, మనువాద పార్టీల నాయకులు అక్రమంగా సంపాదించిన నోట్లతో ఓట్లను కొనుగోలుచేసి అధికారంలోకి వచ్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారన్నారు. రాజ్యాంగంలోని ఆదేశికసూత్రాలకు వ్యతిరేకంగా పరిపాలిస్తూ సామాజికంగా, ఆర్థికంగా బహుజనులను మరింత వెనుకబాటుకు గురిచేస్తున్నారన్నారు. భారత రాజ్యాంగాన్ని బహుజన్‌సమాజ్‌పార్టీ మేనిఫెస్టోగా ప్రకటించిందన్నారు. బహుజనుల జీవితాల్లో వెలుగులు నింపగల శక్తి కేవలం బహుజనులచే స్థాపించిన బీఎస్పీకి మాత్రమే ఉందన్నారు. బహుజన రాజ్యాధికార సభకు బీఎస్పీ నేషనల్ కోఆర్డినేటర్ ఆకాశ్‌ఆనంద్, రాజ్యసభసభ్యులు రాంజీగౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, ఇతర బీఎస్పీ ప్రముఖులు హాజరవుతారన్నారు. సమావేశానికి ముందు పట్టణంలో బహుజనులతో టిప్పుసుల్తాన్ కాంపౌండ్ నుంచి మిషన్ కాంపౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సహదేవ, బాలాజీ, అరుణ్, శీను, శివ, అనిల్, లక్ష్మీపతి, పెద్దోడు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2వేల నోట్లు మార్చుకునేందుకు బ్యాంకుల వద్ద క్యూ



గుర్రంకొండ సప్తగిరి గ్రామీణబ్యాంకులో జన సందడి

గుర్రంకొండ: ఇటీవల కేంద్రప్రభుత్వం రద్దు చేసిన రూ.2 వేల నోట్లను బ్యాంకుల్లో జమ చేసి చలామణి చేసుకొనేందుకు ప్రజలు బారులు తీరడంతో బ్యాంకుల్లో సందడి నెలకొంది. మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో రెండు సప్తగిరి గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, వైశ్యాబ్యాంకు ఉన్నాయి. గత మూడు రోజులుగా బ్యాంకులు ప్రజల రద్దీతో కిక్కిరిసిపోతున్నాయి. ఓవైపు రద్దయిన రూ.2వేల నోట్లను బ్యాంకుల్లో జమ చేసేందుకు ప్రజలు క్యూ కడుతున్నారు. మరోవైపు రోజువారీ నిత్యం బ్యాంకు లావాదేవీలు, కార్యకలాపాల కోసం ప్రజలు తరలివస్తున్నారు. రూ.2వేలు నోట్లు 25 వరకు బ్యాంకుల్లో డిపాటిజ్ చేసుకొంటున్నారు. రూ.20 వేలు దాటితే పాన్ కార్డు ఆధారంగా చేసుకొని డిపాజిట్ చేసుకొంటున్నారు.

టీడీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజీనామా

కలికిరి: కలికిరి పట్టణానికి చెందిన టీడీపీ ముస్లిం మైనారిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ హనీఫ్ తన పదవి, సభ్యత్వానికి రాజీనామా చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైనారిటీ జేఏసీ సేవా సంస్థ ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న తాను, ప్రజలకు మరింత సేవ చేయడానికి టీడీపీలో చేరితే అక్కడ సేవా కార్యక్రమాలకు కనీస గుర్తింపు లభించడలేదన్నారు. తనపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేశారని, త్వరలో భవిష్యత్ రాజకీయ నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



విద్యార్థులకు నగదు బహుమతిని అందిస్తున్న విశ్రాంత లెక్చరర్ గోవింద రెడ్డి

వాల్మీకిపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి అన్నారు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం స్థానిక పాఠశాలలో నగదు బహుమతిని విశ్రాంత లెక్చరర్ గోవింద రెడ్డి అందించారు. మేఘన 574 మార్కులు సాధించడంతో రూ.2500, నాజియా 564 మార్కులు సాధించడంతో రూ.1500, మీనాక్షి 545 మార్కులు సాధించడంతో రూ.1000 చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్‌కు అవసరమైన ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు లెక్చరర్‌లను ప్రభుత్వం నియమించిందన్నారు. పదవ తరగతి పాస్ అయిన బాలికలు బాలికల జూనియర్ కళాశాలలో చేరాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో లెక్చరర్‌లు నారాయణ, రవి కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, నాగేశ్వర్, బాలగంగాధర్ తిలక్, వెంకటేశ్వర్‌రావు, రెడ్డి జాన్సన్, పుష్పలత, లక్ష్మికాంత, తదితరులు పాల్గొన్నారు.

'వెలుగు'తో శరత్‌బాబు అనుబంధం



వెలుగు పాఠశాల విద్యార్థులతో సినీ నటుడు శరత్‌బాబు (ఫైల్)

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలతో సినీనటుడు శరత్‌బాబుకు మంచి అనుబంధం ఉంది. 2012లో శరత్‌బాబు పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో దివ్యాంగుల విద్యార్థులు, వృద్ధాశ్రమంలను సందర్శించి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. పాఠశాల సిబ్బంది అభినందించారు. తరచూ హార్సిలీహిల్స్‌కు వస్తే పాఠశాలలో కొద్ది సేపు విద్యార్థులతో ముచ్చటించేవారు. అంతే కాకుండా పాఠశాల నిర్వాహకులు ఉదయమోహన్‌రెడ్డితో తరచూ ఫోన్‌లో మాట్లాడేవారు. చెన్నైకి వెళితే శరత్‌బాబును కలిసేశారు. ఆయన మృతి పట్ల ఉదయమోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం ప్రకటించారు.

ఘనంగా వెంకటరమణస్వామి దోపోత్సవం



పుష్పపల్లకీపై ఊరేగుతున్న వెంకటరమణస్వామి

రామసముద్రం : మండలంలోని మినికి గ్రామంలో వెలసిన కళ్యాణ వెంకటరమణస్వామి ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారికి ఘనంగా దోపోత్సవం నిర్వహించారు. ఉదయం కలిశారాధన, హోమాలు, ప్రాకారోత్సవం, ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. చుట్టు నక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటరమణస్వామి వారిని పుష్పపల్లకీపై ఊరేగించారు. ఇంటింటా మహిళలు స్వామివారికి కర్పూర హారతులు అందించారు. అలాగే ఆలయం వద్ద భక్తులు కాలక్షేపం కోసం పౌరాణిక నాటకం నిర్వహించారు.

పంటలకు జీవామృతం ఎంతో మేలు

వాల్మీకిపురం : రైతులు సాగు చేసిన పంటలకు ప్రకృతి వ్యవసాయంలో తయారు చేసిన ద్రవ జీవామృతం పిచికారీ చేయడం వలన పంట ఎదుగుదల బాగుంటుందని ప్రకృతి వ్యవసాయ మండల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ రెడ్డిబాషా అన్నారు. మంగళవారం మండలంలోని జర్రావారిపల్లిలో రైతు ఆనంద్ ఒక ఎకరం విస్తీర్ణంలో 30 రకాల విత్తనాలతో సాగు చేసిన ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్‌కు 200 లీటర్ల ద్రవ జీవామృతంను తయారు చేయడం జరిగిందన్నారు. ద్రవ జీవామృతం వలన భూమిలోపల ఎక్కువ సంఖ్యలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయన్నారు. తద్వారా మొక్కకు కావలసిన పోషకాలు అందుతాయన్నారు. సిబ్బంది పెద్దరెడ్డెయ్య, అనురాధ, శ్రీరాములు పాల్గొన్నారు.

కేతు విశ్వనాథరెడ్డి మృతి తీరని లోటు

మదనపల్లె సిటీ: ప్రముఖ రచయిత, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మృతి తీరని లోటని అరసం కార్యవర్గ సభ్యులు, ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి అన్నారు. సాహితీరంగానికి ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఆయన ఆత్మశాంతి కలగాలని వేడుకున్నట్లు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కురబలకోట : వచ్చేనెల 3న మండలంలోని అంగళ్లులో జరిగే వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం పోస్టర్లను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు నియోజక వర్గాల సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లకు అంగళ్లులో సమావేశం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా మారెమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో మారెమ్మ

రామసముద్రం : మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లెలో వెలసిన గ్రామదేవత మారెమ్మ జాతర మంగళవారం అత్యంత వైభవంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం గ్రామానికి చెందిన గ్రామదేవతలకు మహిళలు ఉపవాస దీక్షలతో దీపాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామదేవత మారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పలు రకాల పుష్పాలతో అలంకరించి కోలాటలు, చెక్కభజనలు నడుమ అత్యంత వైభవంగా ఊరేగించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. బంధుమిత్రులతో తిరుమలరెడ్డిపల్లె గ్రామం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం బెంగళూరు, తమిళనాడు నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం



మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు రూరల్ : ఈ నెల 19న దారుణ హత్యకు గురైన షేక్ మహమ్మద్‌అలి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాలాజీ టాకీస్ వీధిలో మృతుని ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుని పిల్లలను అక్కున చేర్చుకుని ఏ సాయం కావాలన్నా తాము చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా జిల్లా కలెక్టర్ ద్వారా రూ. 2 లక్షలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ. 8 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు సాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మృతుని భార్యకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. పిల్లలను చదివించే బాధ్యతను కూడా తాము తీసుకుంటామని తెలిపారు. అలాగే రెండు ఇంటి పట్టాలు కూడా మంజూరు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ, డీసీసీబీ డైరెక్టర్ మస్తాన్, మైనారిటీ నాయకులు గడిబాషా, రెడ్డిబాషా, మసూద్, షాకీర్, మునీర్, అబీద్, అతికా షఫీ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను బలోపేతం చేయాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓ మురళికి వినతిపత్రం అందజేస్తున్న రచయిత వెంకటేశ్వరరెడ్డి

మదనపల్లె సిటీ : గ్రంథాలయాలను బలోపేతం చేయాలని ప్రముఖ రచయిత మంచికంటి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గ్రంథాలయాలను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా మోటార్ సైకిల్‌పై రాష్ట్ర వ్యాప్త పర్యటన చేస్తున్న వెంకటేశ్వరరెడ్డి శనివారం మదనపల్లెకు చేరుకున్నారు. సాహితీమిత్రులతో కలిసి స్థానిక ఆర్డీవో ఎం.ఎస్.మురళికి వినతి పత్రం అందజేశారు. స్థానిక గొల్లపల్లిలోని శాఖ గ్రంథాలయంను సందర్శించారు. సాహితీమిత్రులు, పాఠకులను ఉద్దేశించి మాట్లాడారు. సాహితీవేత్తలందరూ గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించి శాస్త్రీయ రచనలు చేసి సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాఠకులను గ్రంథాలయాలకు రప్పించే బాధ్యత గ్రంథాలయ అధికారులతో పాటు రచయితలకు కూడా ఉందన్నారు. సమాజంలో సర్వరుగ్మతలకు పుస్తకాలే ఔషధాలన్నారు. పుస్తక పఠన పెంపొందించాలని కోరారు. అభ్యుదయ రచయితల సంఘం ప్రజాచైతన్య స్రవంతి సభ్యులు ఆయన్ను శాలువతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వసంత, అసరం నాయకులు టీఎస్ఏస్ఏ కృష్ణమూర్తి, కవితశ్రీ, తిరుపతిరావు, కామకోటి ప్రసాదరావు, లింగాల యుగంధర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే లోకోస్ యాప్



లోకోస్ యాప్‌పై వివరిస్తున్న సీసీ శ్రీనివాసులు

తంబళ్లపల్లె : మండలంలో అమలవుతున్న వైఎస్సార్ క్రాంతిపథం పథకంలో పారదర్శక కోసమే ప్రభుత్వం లోకోస్ యాప్ రూపొందించినట్లు ఏపీఎం గంగాధర్ తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వీఓఏలకు జరుగుతున్న లోకోస్ యాప్ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. లోకోస్ యాప్‌లో ప్రతి మహిళా సంఘం సభ్యురాలు వివరాలతో పాటు గ్రామ, మండల, జిల్లా సమాఖ్యల వరకు పూర్తి సమాచారం యాప్ సహాయంతో తెలుసుకోవచ్చునన్నారు. బ్యాంకు లావాదేవీలు, పొదుపులు, చెల్లించిన వడ్డీలు అన్ని సమాచారం ఉంటుందన్నారు. ఎక్కడా ఎలాంటి అక్రమాలు జరిగేందుకు వీలుండదన్నారు. ప్రతి సంఘం సభ్యురాలికి పూర్తి సమాచారం తెలియడంతో మరింత నమ్మకం కలుగుతుందన్నారు. రీసోర్సుపర్సన్ మహ్మద్‌బాషా, సీసీలు సుబ్బరామయ్య, రమణ, శ్రీనివాసులు యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు.

నూతన వధూవరులకు మంత్రి ఆశీర్వాదం



నూతన వధూవరులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరురూరల్ : పులిచెర్ల మండలం దేశిరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి కుమారుడు నిరంజన్‌రెడ్డి, కల్లూరుకు చెందిన రమణారెడ్డి కుమార్తె జ్యోత్స్నల వివాహం మంగళవారం స్థానిక ఎంఎం కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మంత్రి తోపాటు టీటీడీ బోర్డు డైరెక్టర్ పోకల అశోక్‌కుమార్, చిత్తూరు జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు చేరిన వేరుశనగ విత్తనకాయలు



వేరుశనగ విత్తనకాయలు పరిశీలిస్తున్న ఏడీఏ వై.వి. రమణరావు

పీలేరురూరల్ : ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమగు వేరుశనగ విత్తనకాయలు రైతు భరోసా కేంద్రాలకు చేరినట్లు ఏడీఏ వై.వి. రమణరావు తెలిపారు. మంగళవారం మండలంలోని దొడ్డిపల్లె ఆర్‌బీకే కేంద్రానికి చేరిన వేరుశెనగ విత్తనకాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు మండలానికి నారాయణ రకం విత్తనకాయాలు 1500 క్వింటాళ్లు, కేవీపల్లె మండలానికి 1700 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. త్వరలో విత్తనకాయలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవోలు రమాదేవి, కరుణాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందించకుంటే చర్యలు

కలకడ : మండలంలోని ప్రతి బియ్యం కార్డుదారునికి సకాలంలో నిత్యావసర సరుకులు అందించకుంటే డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తప్పవని సివిల్ సప్‌లేస్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి డీలరు విధిగా 1వతేదీ నాటికి బియ్యం, చక్కర, కందిపప్పు గోడౌన్ పాయింట్‌కు వెళ్లి తూకం సరిచూసుకుని ఎండీయూ ఆపరేటర్‌కు అందించాలన్నారు. డీలర్ వద్ద నిల్వ స్టాక్, పంపిణీ సరిపోవాలని తేడాలు వుంటే కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీలర్‌ల సంఘం అధ్యక్షులు సురేంద్ర, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పిల్లలను తల్లిదగ్గరకు చేర్చిన 'దిశ'

- ఇంట్లో చెప్పకుండా పిల్లలను తీసుకెళ్లిన పెద్దనాన్న
- ఆందోళనతో దిశ యాప్‌కు ఫోన్ చేసిన తల్లి
- సత్వరమే స్పందించిన పోలీసులు
- కదిరిలో బాలికలను గుర్తించి తల్లికి అప్పగింత



పిల్లలను కదిరి బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకుంటున్న తాలూకా ఎస్‌ఐ సుధాకర

మదనపల్లె : ఆపదలో ఉన్న మహిళల రక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన దిశ ఎస్‌వోఎస్ యాప్ సత్ఫలితాలనిస్తోంది. దిశ కంట్రోల్ సెంటర్‌కు ఫిర్యాదు అందిన నిమిషాల వ్యవధిలోనే పోలీసులు సత్వరం స్పందిస్తుడటంతో బాధితులకు న్యాయం జరుగుతోంది. తాజాగా తన పిల్లలను వరుసకు బావ అయిన వ్యక్తి బలవంతంగా ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడంటూ ఓ మహిళ దిశ కంట్రోల్ సెంటర్‌కు ఫిర్యాదు అందించడంతో గంటల వ్యవధిలోనే పోలీసులు కదిరిలో పిల్లలను గుర్తించి తల్లి వద్దకు చేర్చిన ఘటన మంగళవారం జరిగింది. మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట వైఎస్సార్ జగన్‌కాలనీలో నివాసం ఉండే సుబ్రహ్మణ్యంకు ఇద్దరు కుమారులు. పెద్ద అబ్బాయి సోమశేఖర్, రెండోఅబ్బాయి నరేష్. వీరిలో సోమశేఖర్ జులాయి, తాగుడుకు బానిస. కదిరి దేవిరెడ్డిపల్లెలో నివాసం ఉంటున్నాడు. ఇతడి ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో భార్య పద్మావతి వదిలేసి వెళ్లిపోయింది. ఇతడికి ఒక కుమార్తె రెడ్డి జాహ్నవి ఏడోతరగతి చదువుకుంటోంది. తల్లి లేకపోవడంతో జాహ్నవి తాత సుబ్రహ్మణ్యం వద్ద మదనపల్లెలో ఉంటోంది. రెండో అబ్బాయి నరేష్ ఐదేళ్ల క్రితం చనిపోయాడు. ఇతడి భార్య లావణ్య రాయచోటిలో పుట్టింటిలో ఉంటూ స్థానికంగా వలంటీర్‌గా పనిచేస్తోంది. ఈమెకు ఒక పాప గ్రీష్మ నాలుగోతరగతి చదువుతోంది. వేసవి సెలవులు కావడంతో కూతురిని మదనపల్లెలోని మామగారింటికి పంపింది. సోమవారం సాయంత్రం సుబ్రహ్మణ్యం దంపతులు పిల్లలు రెడ్డిజాహ్నవి, గ్రీష్మలను ఇంటివద్దనే వదిలి కదిరికి వెళ్లారు. సరిగ్గా అప్పుడే పెద్దనాన్న సోమశేఖర్ ఇంటికి వచ్చి తల్లిదండ్రులను విచారించగా కదిరికి వెళ్లినట్లు పిల్లలు చెప్పడంతో మనమూ వెళదామని పిల్లలను తీసుకుని సీటీఎం రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. అప్పటికే రైలు వెళ్లిపోవడంతో తిరిగి వారిని తీసుకుని మదనపల్లెకు వచ్చాడు. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు ఇంటికి రావడంతో పిల్లలను తనవెంట కదిరికి తీసుకెళుతున్నట్లు చెప్పాడు. తాగుబోతువైన నీవు పిల్లలను కనిపెట్టుకోలేవని తండ్రి నిరాకరించడంతో తన పిల్లలు తన ఇష్టమంటూ ఎక్కడికైనా తీసుకెళతామనంటూ వారిని బలవంతంగా తీసుకుని ఇంటి నుంచి వచ్చేశాడు. ఈక్రమంలో సోమశేఖర్ ఫోన్ స్విచ్ఆఫ్ కావడం, పిల్లల గురించి తాత ఆందోళన చెందుతూ రాయచోటిలోని రెండో కోడలు లావణ్యకు సమాచారం అందించాడు. దీంతో ఆమె పిల్లల భద్రతపై ఆందోళన చెందుతూ వెంటనే దిశ ఎస్ఓఎస్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసింది. సత్వరమే స్పందించిన పోలీసులు సాంకేతికత ఆధారంగా పిల్లలు కదిరిలో ఉన్నట్లు గుర్తించారు. మదనపల్లె తాలూకా ఎస్‌ఐ సుధాకర్‌కు సమాచారం అందించడంతో ఆయన నేరుగా కదిరికి వెళ్లి పిల్లలను తీసుకువచ్చి తల్లి లావణ్యకు అప్పగించాడు. పిల్లలు క్షేమంగా తనవద్దకు చేరడంతో సంతోషించిన తల్లి దిశ యాప్‌కు, ప్రవేశపెట్టిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.